క్లుప్తంగా

వైభవంగా అమ్మవారి సేవ



పెదపట్నంలంకలో ఆకట్టుకున్న శక్తి వేషం

మామిడికుదురు: పెదపట్నంలంకలో కొలువైన మహాలక్ష్మమ్మ జాతరలో భాగంగా గురువారం రాత్రి అమ్మవారి సేవను వైభవంగా జరిపించారు. గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలు, చిత్ర, విచిత్ర వేషధారణలు, శక్తి వేషాలు, బుట్ట బొమ్మల కోలాహలం, తీన్‌మాన్ విన్యాసాలు, భారీ బాణసంచా కాల్పుల నడుమ సేవను అంగరంగ వైభవంగా జరిపించారు. దేవి సెంటర్ యూత్ ఆధ్వర్యంలో ఈ సేవ నిర్వహించారు. గ్రామంలో కోలాహలం నెలకొంది. యువకులు విజిల్స్ వేస్తూ, డ్యాన్సులు చేస్తూ ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా సేవలో పాల్గొన్నారు. కాగా ఆదివారం రాత్రి అమ్మవారి జాతర జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. సోమవారం అమ్మవారికి నైవేద్యాలు చెల్లిస్తారని, మంగళవారం సిరిబొమ్మ తీర్థం జరుగుతుందన్నారు. అమ్మవారి జాతరలో భాగంగా ఆలయాన్ని విద్యుత్ దీపాల కాంతులతో శోభాయమానంగా తీర్చిదిద్దారు.

ఉపాధి పనుల్లో పారదర్శకత పాటించాలి

అయినవిల్లి: ఉపాధి పనుల్లో పారదర్శకత పాటించాలని ఎంపీడీఓ జీవీ సరోవరరావు అన్నారు. మండలంలోని నేదునూరు గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఎంపీడీఓ జీవీ సరోవరరావు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్, మేట్లు ఉపాధి పనుల నాణ్యత పాటించాలన్నారు. పంట బోదెలు, రహదారుల వెంబడి ఉన్న తూడు, వయ్యారి భామ, చెత్త తొలగించి అభివృద్ధి చేయాలన్నారు. ఉపాధి కూలీలతో కాసేపు చర్చించారు. ఆయన వెంట ఏపీఓ, క్షేత్రసాయి సిబ్బంది ఉన్నారు.

వంద మందికి ఉచిత వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మురళీధర్, లక్ష్మి

మామిడికుదురు: పెదపట్నంలంక గిడుగువారిపాలెంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. హైదరాబాద్‌కు చెందిన యూనివర్సల్ లైఫ్ స్టైల్ ఆస్పత్రికి చెందిన వి.మురళీధర్, కాదా లక్ష్మి ఆధ్వర్యంలో సుమారు 100 మందికి ఉచితంగా పరీక్షలు చేశారు. కిడ్నీ, లివర్, గుండె, పొట్ట, ఊపిరితిత్తులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. గ్రామ సర్పంచ్ సుందరనీడి చిన్ని, ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య, మాజీ సర్పంచ్ మామిడిశెట్టి శివరామప్రసాద్, గిడుగు వెంకటరామారావు శిబిరంలో సేవలందించారు.

అన్నదాన ట్రస్టుకు రూ.10 వేల విరాళం



దాతకు స్వామి వారి చిత్రపటం అందిస్తున్న పర్యవేక్షకుడు సత్యమూర్తి

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలుచేస్తున్న నిత్య అన్నదాన ట్రస్టుకు జగ్గంపేటకు చెందిన సుంకర నాయుడు అతని కుమార్తె మంజూష వారి కుటుంబ సభ్యులు శుక్రవారం రూ.10,116 విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని ఆలయ పర్యవేక్షకుడు సత్యమూర్తికి అందజేశారు. విరాళం అందించిన దాతకు అర్చకులు వేద ఆశీర్వచనం అందజేశారు. స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.91,542 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. స్వామి వారి నిత్య అన్నదానం ట్రస్టుకు భక్తులు రూ.33,022 విరాళాలుగా అందించారన్నారు. మొత్తం 1500 మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారని, 600 మంది స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించారని తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పి.గన్నవరం: ముఖ్యమంత్రి సహాయనిధి కింద నియోజకవర్గంలో 14 మంది లబ్ధిదారులకు రూ.9,59,980లను చెక్కుల రూపంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ శుక్రవారం పి.గన్నవరంలోని తన కార్యాలయం వద్ద అందజేశారు. సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, మద్దాల సుబ్రహ్మణ్యం, తాటికాయల శ్రీను, యడ్ల ఏసు, తాటికాయల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

డీశాలినైజేషన్ ప్లాంట్లపై నీలి నీడలు

- మంజూరైనా ఏర్పాటు లేదు
- భవిష్యత్ తరాల తాగునీటికి ఇవే ఆధారం
- ఊరిస్తున్న ఓఎన్జీసీ
- ఏడేళ్లయినా ఆ మాటే లేదు



విదేశాలల్లో డీ శాలినైజేషన్ ప్లాంటు

మలికిపురం: ఉప్పునీటి ప్రభావం అధికంగా ఉండి తాగునీటి ఎద్దడిని తీవ్రంగా ఎదుర్కొంటున్న రాజోలు దీవికి ఓఎన్జీసీ ఇచ్చిన వరాలు డీశాలినైజేషన్ ప్లాంట్లు. భూగర్భ జలాలు అడుగంటుతున్న ప్రస్తుత తరుణంలో రాజోలు దీవిలో చమురు నిక్షేపాలను సేకరిస్తున్న ఓఎన్జీసీ ఈ దీవిలో సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఇక్కడి ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేసి ఈ ప్లాంట్లను మంజూరు చేసింది. సుమారు నాలుగు దశాబ్దాలుగా ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఓఎన్జీసీ స్థానిక ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాలకు పెద్ద పీట వేసింది. ఏడేళ్ల క్రితం సుమారు రూ.80 కోట్లతో రెండు డీ శాలినైజేషన్ ప్లాంట్లు మంజూరు చేసింది. అయితే వీటి ఏర్పాటుపై నీలినీడలు అలముకున్నాయి. మంజూరు చేసి ఇన్నేళ్లయినా నేటికీ పనులు ప్రారంభం కాలేదు. దీంతో వీటి ఏర్పాటుపై ప్రజల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రాజోలు దీవి పూర్తిగా సముద్ర తీర ప్రాంతం. పైగా ఏ కారణాల చేతనైతేనేమి గత 20 ఏళ్లగా రాజోలు దీవిలో మూడు అంగుళాల మేర భూమి కిందికి దిగిందని నిపుణుల అధ్యయనం స్పష్టం చేసింది. దీంతో ఇక్కడ ఉప్పునీటి ప్రభావం అధికంగా ఉంది. సుమారు మూడు లక్షల జనాభా ఉన్న ఈ ప్రాంతంలో ప్రస్తుతం, భవిష్యత్ తరాలు కూడా తీవ్ర నీటి కష్టాలు ఎదుర్కొనక తప్పదు. చుట్టూ మూడు వైపులా గోదావరి నది, మరో వైపు సముద్రం. ఇవన్నీ ఉప్పునీటి ప్రవాహాలే. నాలుగు అడుగుల గొయ్యి తవ్వితే ఉప్పునీరు వస్తుంది. ఈ దీవిలో ఉన్న బావుల్లో 80 శాతం ఉప్పు నీరే వస్తుంది. ఈ దశలో సుమారు ఇరవయ్యేళ్ల క్రితం ఆర్‌డబ్ల్యూఎస్ ఏర్పాటు చేసిన గుడిమెళ్లంక తాగునీటి పథకంతో ఈ ప్రాంత ప్రజల తాగునీటి ఆశలు చిగురించినా వేసవిలో ఆ ప్రాజెక్టు పనితీరు అంతంత మాత్రంగానే ఉంది. ఈ దశలో ఓఎన్జీసీ అందించిన ఈ ప్లాంట్‌లు రాజోలు దీవి వాసులకు వరప్రసాదాలే. రాజోలు దీవిలో మోరి, కేశనపల్లి కేంద్రాలుగా ఈ ప్లాంట్లను మంజూరు చేసింది. ఈ రెండు ప్రాంతాలు కేజీ బేసిన్‌లో ప్రధాన ఆయిల్, గ్యాస్ క్షేత్రాలుగా బాసిల్లుతున్నాయి.

డీశాలినైజేషన్ ప్లాంట్లు

ఈ ప్లాంట్‌లు ఇప్పటికే చెన్నై, ముంబై, కోల్‌కతా తదితర ప్రాంతాలలో పని చేస్తున్నాయి. ఉప్పు నీటిని స్వీట్ వాటర్ (తాగునీరు)గా మారుస్తాయి. ఇటువంటి ప్రాజెక్టులను సముద్రతీర ప్రాంతాల్లో కేశనపల్లి, మోరి కేంద్రాలుగా ఓఎన్జీసీ ఏర్పాటు చేస్తుందని అప్పట్లో రాజమహేంద్రవరం ఓఎన్జీసీ అసెట్ మేనేజర్లు సైతం పలుమార్లు ప్రకటించారు. ఒక్కో ప్లాంట్ ఖరీదు రూ.40 కోట్లు. ఒక్కో ప్లాంట్ ద్వారా రోజుకు 2.50 లక్షల తాగునీటిని ఉత్పత్తి చేసే సామర్థ్యంతో వీటిని ప్రతిపాదించారు. పూర్తిగా సముద్రం నుంచే ఉప్పునీటిని తీసుకుంటారు. ప్రత్యేక పైప్‌లైన్లు వేసుకుంటారు. జనాభా ప్రకారం రాజోలు దీవి వాసులకు రోజుకు 18 లక్షల లీటర్ల తాగు నీరు ఒక మోస్తరుగా సరిపోతుంది. అయితే ఇప్పటి వరకూ ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టుల ద్వారా రోజుకు 6 లక్షల లీటర్ల కూడా అందడం లేదు. ఇవి కూడా అవాంతరాలను ఎదుర్కొని సరఫరా అవుతున్నాయి. ప్రస్తుతం ఓఎన్జీసీ మంజూరు చేసిన రెండు డీ శాలినేషన్ ప్లాంట్లు పని ప్రారంభిస్తే రోజుకు మరో 5 లక్షల లీటర్ల తాగునీటిని అందించవచ్చు. ఇక్కడ ప్లాంట్‌లు ఏర్పాటు చేసి నియోజకవర్గం ప్రజలకు తాగునీరు అందించే ప్రణాళిక ఏనాటికి సాకారం అవుతుందో వేచి చూడాలి. అయితే ఇటీవల రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కృషితో గుడిమెళ్లంక తాగునీటి పథకం వద్ద రూ.5 కోట్లతో ర్యాపిడ్ ఫిల్టర్ ఏర్పాటుకు ఓఎన్జీసీ నిధులు మంజూరు చేసిందని ఆయన ప్రకటించారు. అయితే రూ.80 కోట్ల డీశాలినైజేషన్ ప్లాంట్ల ఏర్పాటుకు కూడా ఆయన కృషి చేయాలని నియోజక వర్గ ప్రజలు కోరుతున్నారు.

ఓఎన్జీసీపై ఒత్తిడి తేవాలి



ఓఎన్జీసీ గతంలో మంజూరు చేసిన డీ శాలినైజేషన్ ప్లాంట్ల ఏర్పాటుకు ఆ సంస్థపై ఒత్తిడి తేవాలి. లేకుంటే భవిష్యత్ తరాల తాగునీటికి చాలా ఇబ్బందులు వస్తాయి. రాజోలు దీవికి ఈ ప్లాంట్లు చాలా అవసరం. ఇక్కడ భూమి కుంగి ఉప్పు నీటి మయమవుతుంది.

– గొల్లపల్లి సూర్యారావు, మాజీ మంత్రి

దీనిపై ఆరా తీస్తాం



డీ శాలినైజేషన్ ప్లాంట్లపై ఓఎన్జీసీ ఏఏ హామీలు ఇచ్చిందో తెలుసుకుని వాటి మంజూరు అంశాలపై దృష్టి పెడతాను. ఆ సంస్థల ద్వారా నియోజకవర్గానికి ఎంత న్యాయం జరగాలో అంత న్యాయం జరిపించేందుకు నా వంతు కృషి చేస్తాను.

– దేవ వరప్రసాద్, ఎమ్మెల్యే, రాజోలు

స్వామివారి సన్నిధిలో ఆర్డీఓ మాధవి



అంతర్వేదిలో స్వామి చిత్రపటం అందుకుంటున్న ఆర్డీఓ మాధవి

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం అమలాపురం ఆర్డీఓ కొత్త మాధవి, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆర్డీఓకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు ఆర్డీఓకు ఆశీర్వచనాలు పలికారు. ఆర్డీఓకు స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాన్ని సూపరింటెండెంట్ పి.విజయసారథి అందజేశారు. తహసీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, డీటీ భాస్కర్, మండల ఆర్ఐ రామరాజు పాల్గొన్నారు.

రక్తదానంపై అపోహలు తొలగించాలి



రాజోలు బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేస్తున్న వెంకటరమణ, రమ్య దంపతులు

రాజోలు: కొంతమందిలో రక్తదానంపై ఉన్న అపోహలను తొలగించేందుకు పొదలాడ గ్రామానికి చెందిన దంపతులు కాంద్రేగుల వెంకటరమణ, రమ్య దంపతులు శుక్రవారం రాజోలు ప్రభుత్వాస్పత్రిలోని బ్లడ్‌బ్యాంక్‌లో రక్తదానం చేశారు. రక్తదానం చేయడం ద్వారా ఎలాంటి అనారోగ్య సమస్యలు రావని, ప్రాణపాయ స్థితిలో ఉన్న వారిని రక్షించేందుకు వీలు కలుగుతుందని వెంకటరమణ అన్నారు. పొదలాడ కేంద్రంగా యువరత్న ఎన్టీఆర్ సేవా సమితి రక్తదాన శిబిరాలు నిర్వహించి ఎంతో ఆదర్శంగా నిలుస్తుందన్నారు. సేవా సమితి స్ఫూర్తితోనే రక్తదానం చేసినట్టు దంపతులు వెంకటరమణ, రమ్య తెలిపారు.

రెండో రోజు హనుమజ్జయంతి వేడుకలు

సఖినేటిపల్లి: ఆంజనేయస్వామి ఆలయాల్లో శుక్రవారం రెండో రోజు హనుమజ్జయంతి వేడుకలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. మోరి శ్రీరామ భక్తాంజనేయ ఆలయంలో అర్చకుడు సుదర్శనం రంగాచార్యుల ఆధ్వర్యంలో స్వామికి ఉదయం విశేష పూజలు చేశారు. సాయంత్రం భక్తుల నడుమ అర్చకుడు స్వామికి అర్చన చేశారు. మోరి ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఆలయ అర్చకుడు ముత్యాల సతీష్ ఆధ్వర్యంలో సహస్ర దీపాలంకరణ ఏర్పాటు చేశారు. అలాగే హనుమాన్ జయంతి సందర్భంగా అంతర్వేదికర, టేకిశెట్టిపాలెం, అంతర్వేది రోడ్డు సెంటర్, కేశవదాసుపాలెం ఆంజనేయస్వామి ఆలయాలలో భక్తులు పూజలు నిర్వహించారు. భక్త బృందాలు నిర్వహించిన ఏకాహాలతో హనుమాన్ ఆలయాలు ప్రతిధ్వనించాయి.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన ఆర్డీవో



పెదపళ్ల పీహెచ్‌సీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీకర్

అలమూరు: మండలంలోని పెదపళ్లలోని పీహెచ్‌సీని కొత్తపేట ఆర్డీఓ పి.శ్రీకర్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్యసేవలను రోగులను అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రి ఆవరణలో పారిశుధ్యాన్ని, నిర్వహణ తీరును పరిశీలించారు. అలాగే ఆసుపత్రిలో సిబ్బంది ఎదుర్కొంటున్న గదుల కొరతను ఆయన గుర్తించారు. ఫార్మసీ రూమ్‌ను పరిశీలించి మందుల సరఫరా జరుగుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. పీహెచ్‌సీ ప్రధాన ద్వారం పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని గుర్తించి వైద్యారోగ్య సిబ్బంది సూచనల మేరకు అక్కడ ఫార్మసిస్టు గదిని నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరిసరాలను ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని, మందుల కొరత రానీయవద్దని వైద్యాధికారి డి.సాయి కిషోర్‌కు సూచించారు. ఎంపీడీఓ ఎ.రాజు, డిప్యూటీ తహసీల్దార్ టి.సుబ్బరాజు, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, గ్రామ కార్యదర్శి వి.వేణి, వీఆర్ఓ బి.ఉదయ్ కుమార్, హెల్త్ అసిస్టెంట్ వి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సమర్థవంతంగా నిర్వహించాలి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న పనులను ఎటువంటి అవినీతికి తావులేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని కొత్తపేట ఆర్డీఓ పి.శ్రీకర్ కోరారు. మండలంలోని ఆలమూరు, పెదపళ్ల, పినపళ్ల గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. మస్టర్ల సంఖ్యకు అనుగుణంగా కూలీల సంఖ్య ఉందో లేదోనని తనిఖీ చేశారు. ఉపాధి పనులు చేసే సమయంలో కల్పిస్తున్న సౌకర్యాలను కూలీలను అడిగి తెలుసుకున్నారు. కూలీలకు నిర్దేశించిన కొలతల ఆధారంగా పనులు చేయించాలని, నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేదిని ఫీల్డ్ అసిస్టెంట్లను హెచ్చరించారు. అనంతరం రికార్డులను పరిశీలించి పిడుగు సూచనలు, సలహాలు అందజేశారు. ప్రతిరోజూ ఉపాధి పనుల ప్రగతిని తెలియజేయాలని ఎంపీడీఓ ఎ.రాజు, ఏపీఓ జి.అరుణకుమారిని ఆదేశించారు. సర్పంచ్ నేలపూడి లావణ్య, మాజీ జెడ్పీటీసీ రామానుజుల శేషగిరిరావు, డీటీ టి.సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై కళాజాతా

అలమూరు: మండలంలోని చింతలూరులో ఎయిడ్స్ నియంత్రణపై కళాజాతా కార్యక్రమం జరిగింది. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఎయిడ్స్ నివారణ సంస్థ ఆదేశాల మేరకు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం రాత్రి నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డి.సాయికిషోర్ ఈ కళాజాతాను ప్రారంభించారు. కళాకారులు బుర్రకథ రూపంలో హెచ్‌ఐవీ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎయిడ్స్ వ్యాధి ఒక సామాజిక రుగ్మతగా భావించి వ్యాధిగ్రస్తులపై వివక్ష ప్రదర్శించకుండా మానవత్వంతో ఆదరించాలన్నారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు ఆందోళన చెందనవసరం లేదని రోగ నిరోధక శక్తిని పరిపుష్టం చేసి ఆయుర్ధాయం పెంచే ఏఆర్‌టీ మందులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్నాయని వివరించారు. అలాగే అంటువ్యాధులైన ఎయిడ్స్, క్షయ వ్యాధితో పాటు సుఖ వ్యాధులు సోకిన రోగులు తీసుకోవలసిన చికిత్స గురించి సవివరంగా తెలియజేశారు. గ్రామీణ ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకే ఈ జాతా ప్రారంభించామని జిల్లా లెప్రసీ ఎయిడ్స్ అండ్ టీబీ సంస్థ తెలియజేసింది. ఐసీడీపీ కౌన్సిలర్ నాగలక్ష్మి, వైద్యారోగ్య, పంచాయతీరాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం

మలికిపురం: నియోజకవర్గంలో విద్యుత్ సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మండలంలోని గుడిమెల్లంకలో ఏర్పాటు చేయనున్న 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు నిర్దేశించిన స్థలాన్ని శుక్రవారం ఆ శాఖ అధికారులతో కలసి ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సబ్ స్టేషన్ ఏర్పాటుకు ఇది అనువైన స్థలం లభించిందని, స్థలాన్ని మెరక చేయడానికి సంబంధిత అధికారులతో మాట్లాడటం జరిగిందని అన్నారు. అవసరమైన రోడ్డు సదుపాయాన్ని ఇక్కడ ఏర్పాటు చేస్తానని తెలిపారు. శంకరగుప్తంతో పాటు సఖినేటిపల్లి మండలంలో కూడా మరో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. సబ్‌స్టేషన్ ఏర్పాటయితే కరెంటు కష్టాలు, మంచినీటి ఇక్కట్లు తీరతాయని గ్రామస్తులకు తెలిపారు. అలాగే స్తంభాల మధ్య లూజ్ తీగలు, విరిగిన, పాడయిన స్తంభాల ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు కూడా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, దిరిశాల బాలాజీ, సర్పంచ్‌లు నల్లి విజయకుమారి, ఆరేటి రంగనాయకులు, ఎంపీటీసీ నల్లి అంజలీ దేవి, మాజీ సర్పంచ్ కలగత ఏసురత్నం, నల్లి ప్రసాద్, తిరుమల బాబి, మల్లిపూడి సత్తిబాబు విద్యుత్ శాఖ అధికారులు, ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆసుపత్రి మూసివేయండి

డీసీహెచ్‌ఎస్‌పై ఎమ్మెల్యే ఆగ్రహం



డయాలసిస్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవ

రాజోలు: రోగులకు సేవలు అందించలేని ఆస్పత్రి అవసరం ఏముంది. ఆస్పత్రిని మూసివేయండి అంటూ రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ జిల్లా సామాజిక ఆస్పత్రి కో–ఆర్డినేటర్(డీసీహెచ్‌ఎస్)పై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన రాజోలు సామాజిక ఆస్పత్రిలో జరుగుతున్న పై అంతస్తు భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అలాగే ఆస్పత్రిలో నిర్వహిస్తున్న డయాలసిస్ సెంటర్‌లో అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఉన్న ఐదు యూనిట్లకు అదనంగా మరో మూడు డయాలసిస్ యూనిట్ల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. గతంలో ఆస్పత్రికి విచ్చేసిన రోగులతో పోలిస్తే అవుట్ పేషెంట్ సంఖ్య తగ్గిపోవడంపై ఎమ్మెల్యే ఆరా తీశారు. గైనకాలజిస్ట్, చిన్న పిల్లల వైద్య నిపుణులు లేరని సూపరింటెండెంట్ ప్రశాంతి ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో ఎమ్మెల్యే జిల్లా ఆస్పత్రి కో–ఆర్డినేటర్‌కు ఫోన్ చేసి రాజోలు కమ్యూనిటీ ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో సేవలు అందించేందుకు గైనకాలజిస్ట్ వెంటనే నియమించాలని, వైద్యులను నియమించలేని పక్షంలో ఆస్పత్రిని మూసివేయండి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో వెంటనే గైనకాలజిస్ట్‌ను నియమించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రికి సామాన్య, నిరుపేద రోగులు వస్తారని, అలాంటి వారికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. సూపరింటెండెంట్ ప్రశాంతి, నాయకులు ముదునూరి చిన బాబు, దిరిశాల బాలాజీ, గుండాబత్తుల తాతాజీ, సూరిశెట్టి శ్రీనివాసరావు, కోళ్ల బాబి తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నను దర్శించుకున్న రామచంద్రమోహన్



వాడపల్లి క్షేత్రంలో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న కమిషనర్ రామచంద్రమోహన్

కొత్తపేట: కోనసీమ తిరుమలగా విరాజిల్లుతున్న ఆత్రేయపురం మండలం వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో కలసి సందర్శించారు. ముందుగా ఆయన స్వామిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ దేవస్థానం ప్రాంగణంలోని వసతులు, సేవలను పరిశీలించారు. మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. మరింత మెరుగైన సౌకర్యాలు, వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ రామచంద్రమోహన్, ఎమ్మెల్యే సత్యానందరావు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో దేవదాయ ధర్మాదాయ శాఖ డీసీ, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో పట్టుబడ్డ ఐదుగురి అరెస్ట్

అలమూరు: గంజాయి సేవిస్తూ పట్టుబడ్డ ఐదుగురు వ్యక్తులను శుక్రవారం అలమూరు పోలీసులు అరెస్ట్ చేశారు. రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఎస్సై ఎం.అశోక్ తెలిపిన కథనం ప్రకారం మండలంలోని పెదపళ్లలోని గ్రామ శివారులోని శ్మశానవాటిక వద్ద శుక్రవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో గంజాయిని నిల్వ ఉంచుకుని సేవిస్తున్నట్టు సమాచారం అందింది. దీనిపై సత్వరమే స్పందించిన ఎస్సై అశోక్ తన సిబ్బందితో దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఒక్కో యువకుడి వద్ద 100 గ్రాముల చొప్పున గంజాయి ఉందని గుర్తించారు. అనంతరం వారి వద్ద ఉన్న మొత్తం 500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఐదుగురు ముద్దాయిలను స్థానిక జూనియర్ సివిల్ కోర్టుకు తరలించగా జడ్జి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై అశోక్ పేర్కొన్నారు.

కిశోర బాలికల వికాసానికి తోడ్పాటు

అలమూరు: కిశోర బాలికల వ్యక్తిత్వ వికాసానికి స్వయం సహాయక సంఘాలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ అధికారి గజలక్ష్మి, ఎంపీడీఓ ఎ.రాజు అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం కిశోరి బాలికల కార్యక్రమం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఐసీడీఎస్ వైద్యారోగ్య, గ్రామ సచివాలయ, విద్యాశాఖ అధికారులు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి కిశోరీ బాలికలకు రక్తహీనత, బాల్య వివాహాల నిర్మూలనకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

రైతుల కోసం రహదారి నిర్మించండి

అంబాజీపేట: రైతులు తాము సాగు చేసిన వ్యవసాయ ఉత్పత్తులు పొలాల నుండి తెచ్చుకునేందుకు రహదారి నిర్మించాలని పుల్లేటికుర్రు మాజీ ఎంపీటీసీ ఎస్ఎస్ఎన్ వర్మ, రైతులు ప్రభుత్వాన్ని కోరారు. పుల్లేటికుర్రు బాబానగర్ వంతెన వద్ద నుంచి మోడేకుర్రు వంతెన వరకు గతంలో నాబార్డు నిధులతో వీవర్స్ కాలనీ వరకు సీసీ రోడ్డు, అక్కడి నుంచి బీటీ రోడ్డును నిర్మించారన్నారు. ఒక రైతులకే కాకుండా రెండు నియోజకవర్గాల ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు. రహదారి అధ్వానంగా ఉందని రైతులు తమ వ్యవసాయోత్పత్తులను తీసుకొని వెళ్లలేకపోతున్నారని, రైతులు, ప్రజల కోసం ఈ రహదారిని నిర్మించాలని కోరుతున్నారు.

పృథ్వీశ్వరస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం

అలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన స్వయంభూ పార్వతీ సమేత పృథ్వీశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి ఉండవల్లి వీర్రాజు చౌదరి పర్యవేక్షణలో పురోహితుల బృందం దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించింది.

పీహెచ్‌సీని త్వరగా పూర్తి చేయాలి

సఖినేటిపల్లి: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ భవనాన్ని త్వరగా పూర్తి చేసి రోగులకు త్వరగా వినియోగంలోకి తెచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సఖినేటిపల్లిలో అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న భవనాన్ని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, పార్టీ డ్రైనేజీ సెల్ రాష్ట్ర కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు, మండల అధ్యక్షుడు పోతురాజు సురేష్, ప్రధాన కార్యదర్శి బోణం నాయుడు సందర్శించారు. 2020లో మంజూరైన రూ.కోటి యాభై లక్షలతో ప్రారంభమైన ఆసుపత్రి నిర్మాణం పనులు అసంపూర్తిగా ఉన్నాయని వారు అన్నారు. భవన నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేసే విధంగా పాలకులు చూడాలని కోరారు.

యూట్యూబ్‌లో వారణాసి చిత్రం విడుదల

కొత్తపేట: నవ యువ దర్శకుడు కథారచయిత పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణానికి చెందిన అడబాల రాహుల్ రాయ్ దర్శకత్వం వహించి నిర్మించిన వారణాసి చిత్రాన్ని శుక్రవారం సినిమా పోస్టర్ రిలీజ్ చేసి సినిమాను యూట్యూబ్‌లో విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ నేను తెలుగు సినీ రచయితల సంఘ సభ్యుడిగా ఉంటూ సందేశాత్మక కథలు అనేకం రాసుకొని ఆ కథలు రిజిస్ట్రేషన్ చేయించుకున్నానన్నారు. వెండితెరపై మంచి దర్శకుడిగా ఎదగాలన్నది తన కలన్నారు. అందుకోసం ముందుగా ఈ డిపెండెంట్ మూవీ 'వారణాసి' తన స్వీయ దర్శకత్వంలో నిర్మించానని తెలిపారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో మంచి సినిమాలు తీసి దర్శకుడిగా ఎదగాలని ఆకాంక్షించారు.